# పారిశుధ్య లోపం.. ప్రజలకు శాపం

బురదమయంగా మారిన రహదారి

జల్లేపల్లిలో విషజ్వరంతో మంచం పట్టిన పుల్లూరు లక్ష్మి

- మంచంపట్టిన జల్లేపల్లి..
- విషజ్వరాలతో వణుకుతున్న గ్రామస్తులు
- ఇంటికొక్కరు చొప్పున బాధితులు
- నలుగురికి డెంగీ నిర్ధారణ.. మరికొంత మందికి లక్షణాలు
- పట్టించుకోని వైద్యాధికారులు

తిరుమలాయపాలెం, జూన్ 27 : పారిశుధ్య లోపం ఆ గ్రామ ప్రజలకు శాపంగా మారింది. ఇంటికొకరు చొప్పున జ్వరంతో బాధపడుతూ.. వైద్యశాలల చుట్టూ తిరుగుతున్నారు. అయినా పారిశుధ్యం వైపు పాలకులు కన్నెత్తికూడా చూడడం లేదు.. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని జల్లేపల్లిలో వీధులన్నీ అపరిశుభ్రంగా ఉన్నా స్పెషల్ అధికారు పట్టించుకోకపోవడంతో రహదారులన్నీ మురికి కూపాలుగా మారాయి. దీంతో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలను కుట్టటడంతో వారు అనారోగ్యం పాలవుతున్నారు. ఇప్పటికే గ్రామానికి చెందిన చెక్కల మల్సూరుకు డెంగీ జ్వరం నిర్ధారణ అయినట్లు ఏఎన్ఎం నాగలక్ష్మి తెలిపారు. మరో ముగ్గురు అవే లక్షణాలతో ఖమ్మంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్నట్లు తెలిసింది. అంతేకాక ఏ ఇంట్లో చూసినా జ్వరంతో మంచంపట్టి బాధపడుతున్నవారు కనిపిస్తున్నారు. పారిశుధ్యాన్ని పాలకులు పట్టించుకోకపోవడం, వానకాలం కావడంతో వరద నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రజలు అనారోగ్యం పాలైనా వైద్యాశాధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ప్రైవేట్‌వైద్యులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే గ్రామంలో 150 మందికి పైగానే జ్వరాలబారిన పడ్డారు. ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించి గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి జ్వరపీడితులకు వైద్యసేవలు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో జ్వరపీడితుల వివరాలు, వారికి అందిస్తున్న వైద్యం గురించి తెలుసుకునేందుకు మండల వైద్యాధికారి రామారావును ఫోన్లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు. ఏఎన్ఎం నాగలక్ష్మిని వివరాలు అడుగగా గ్రామంలో జ్వరాలు ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు.

## విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేత

వైరాటౌన్, జూన్ 27: టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వైరాలోని రిలయన్స్ ట్రెండ్స్ వారి ఆధ్వర్యంలో అవార్డులు, మెడల్స్ సర్టిఫికెట్లను గురువారం అందజేశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు, హెచ్ఎం, ప్రిన్సిపాల్‌ను సత్కరించారు.

## కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా ప్రమోషన్లు

మామిళ్లగూడెం, జూన్ 27: భద్రాద్రి మల్టీజోన్-1 పరిధిలో పనిచేస్తున్న పది మంది కానిస్టేబుళ్లకు ఉద్యోగోన్నతులు కల్పిస్తూ మల్టీజోన్-1 ఐజీపీ రంగనాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఐదుగురు కానిస్టేబుళ్లకు ఈ ప్రమోషన్లలో అవకాశం లభించింది. హెడ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి పొందిన వారిలో పీ.కొండలరావు, ఏ.నాగేశ్వరరావు, డీ.శ్రీనివాసు, వై.రాములు, బీ.లక్ష్మీపతి ఉన్నారు. వీరందరినీ ఉద్యోగోన్నతిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## పీహెచ్‌సీని తనిఖీ చేసిన జడ్పీ సీఈవో

పెనుబల్లి, జూన్ 27: మండలంలోని లంకాసాగర్ ప్రైమరీ హెల్త్‌సెంటర్‌ను జడ్పీసీఈవో ఎస్ వినోద్ గురువారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీకి డీఎఫ్ఎంటీ కింద మంజూరైన రూ.10 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి త్వరతగతిన పూర్తిచేయాలని సూచించారు. అదేవిధంగా మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్ఎంపీలపై దాడులు ఆపాలి

ఎర్రుపాలెం, జూన్ 27 : గ్రామీణ వైద్యులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బీ. కొండలరావు అన్నారు. గురువారం మండలంలో మండల అధ్యక్షుడు పుల్లారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందరగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ వైద్యులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినపల్లి శ్రీనివాసరావు, జిల్లా జాయింట్ సెక్రటరీ ఎస్.రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముజే, మేకల రమేశ్, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

## మైనర్లు డ్రైవింగ్ చేయొద్దు: ట్రాఫిక్ ఏసీపీ

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 27: ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు తెలియని మైనర్లు వాహనాలు తీసుకొని డ్రైవింగ్ చేయవద్దని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. 'ట్రాఫిక్ నిబంధనలు - మోటార్ వాహన చట్టాల'పై ఖమ్మం రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అక్కడి విద్యార్థులకు గురువారం ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కారణం లేని మరణం ఒక్క రోడ్డు ప్రమాదమేనని గుర్తుచేశారు. రోడ్డు ప్రమాదంలో ఏదైనా అనుకోని ఘటనలు జరిగితే కుటుంబం జీవితాంతం బాధపడాల్సి వస్తుందని వివరించారు. సీఐ మోహన్‌బాబు, ఎస్సై రవి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోనే సమాజంలో అంతరాలు తొలగిపోతాయి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మధిర, జూన్ 27 : చదువు ద్వారానే సమాజంలో అంతరాలు తొలగిపోతాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. టీఎస్‌టీయూఎఫ్ మధిర డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న కస్తూరిబాయి పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి అంతరాలు లేని విద్య అందరికీ అందించాలని కోరారు. విద్య ర్యాంకుల కోసం కాదని మంచి సమాజాన్ని నిర్మించడానికని తెలిపారు. సర్వీస్ పర్సన్స్‌ను నియమించాలని, మిగిలిన ఖాళీలను పదోన్నతులు నిర్వహించాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చావా దుర్గాభవానీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, వల్లంకొండ రాంబాబు, ఆంజనేయులు, వీరబాబు, నాగేశ్వరరావు, మీరాఖాన్, సాంబయ్య, రమాదేవి, అరుణ, ఎంఈవో ప్రభాకర్, వినోదరావు, వీరయ్య, నాగరాజు, కోటేశ్వరరావు, ప్రీతం, రామకృష్ణ, పొన్నం వెంకటేశ్వరావు, శీలం నరసింహారావు పాల్గొన్నారు.

## సీతారామప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం రూరల్, జూన్ 27 : సీతారామ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేసి గోదావరి జలాలను పాలేరు రిజర్వాయర్‌లో కలపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్ వద్దగల తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో సీపీఎం రూరల్ మండల కమిటీ సమావేశం మండల ఇన్‌చార్జు ఊరడి సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నున్నా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టులోపు సీతారామ ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీ ఇచ్చి గోదావరి జలాలను పాలేరులో కలపకుండా పెండింగ్‌లో పెట్టి ఏన్కూర్ వద్ద సాగర్‌కు అనుసంధానం చేస్తున్నారన్నారు. తద్వార ఎక్కువ శాతం లాభం జరగదని, పాలేరు రిజర్వాయర్‌లో కలపడం వలన భక్తరామదాసు ప్రాజెక్టు ఎస్ఆర్‌హెచ్ కాల్వతో ఇల్లెందు, డోర్నకల్ నియోజవర్గాలలోని పంట పొలాలకు నీరు అందుతుందన్నారు. రెండులక్షల రుణమాఫీకి ఎటువంటి ఆంక్షలు లేకుండా కటాఫ్ డేట్‌లు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు బుగ్గవీటి సరళ, నండ్రా ప్రసాద్, పీ మోహన్‌రావు, పీ సంగయ్య, వెంకటరెడ్డి, నందిగామ కృష్ణ, ఉపేందర్, సుమతి, పద్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు బ్లాక్‌లను వేలం వేయొద్దు

సత్తుపల్లి, జూన్ 27: తెలంగాణలో సింగరేణి బ్లాక్‌లను వేలం వేయకుండా సింగరేణి సంస్థలకు అప్పగించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యదర్శి జీ రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ప్రజల సంపదలను ఆదానీ, అంబానీలకు అప్పజెప్పడం నీతిమాలని చర్య అన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారమే మేం చేస్తామని చెప్పడం నీతి బాహ్యమైన చర్య అన్నారు. ఇప్పటికే ప్రైవేటీకరణ వల్ల కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, గోదావరి ప్రాంతానికి సహజ సంపద అయిన సింగరేణి రక్షణ కోసం కార్మిక వర్గం తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు ఇ.వెంకన్న మాట్లాడుతూ కార్మిక చట్టాల మార్పుపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రకటించాలన్నారు. సమావేశంలో ఇఫ్ట్యూ నాయకులు సీవై పుల్లయ్య, ఎ శరత్, హమాలీ నాయకులు సూరిబాబు, సత్యం, విశ్వనాథం, కృష్ణ పాల్గొన్నారు.

### బొగ్గుబ్లాక్‌ల వేలాన్ని ఆపాలి

సత్తుపల్లిటౌన్, జూన్ 27: బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని ఆపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంతో సహా దేశంలో వివిధ రాష్ట్రాల్లో 60 బొగ్గు బావులను వేలం వేయడానికి కేంద్ర ప్రభుత్వం మోదీ ప్రయత్నిస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు మోదీ ప్రభుత్వం తహతహలాడుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి ప్రజల ఆస్తులను కారుచౌకగా అంబానీ, అదానిలకు కట్టబెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. సింగరేణి రక్షణ కోసం రక్షణ కోసం పోరాడుతామన్నారు.

## మెప్మా సభ్యులకు చట్టాలపై అవగాహన సదస్సు

వైరాటౌన్, జూన్ 27: హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వైరా మున్సిపాలిటీ కార్యాలయంలో రాష్ట్రజనరల్ సెక్రటరీ ఆదూరి మణి అధ్యక్షతన మానవ హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఫౌండేషన్ అధ్యక్షుడు బొడ్డపాటి దాస్ మాట్లాడుతూ ప్రతి మనిషి రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బహుజన అభ్యుదయ సేవా సమితి వ్యవస్థాపకుడు ఆదూరి ఆనందం మాట్లాడుతూ బాలకార్మిక చట్టం మున్సిపాలిటీ చట్టం 2019, విద్యా హక్కు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు కరిశ రమణ, కల్లూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కువ్వారపు విజయరావు, ఉపాధ్యక్షుడు చిల్లిముంతల వెంకటేశ్వర్లు, మెప్మా ఆర్‌పీలు, మెప్మా ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షురాలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలతో యువత భవిష్యత్ నాశనం

ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు, ఎక్సైజ్ అధికారులు

కారేపల్లి, జూన్ 27: మాదక ద్రవ్యాల మత్తులో యువత భవిష్యత్ నాశనం అవుతుందని సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ సంతప్‌కుమార్, ఎస్సై ఎస్ రాజారాం ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని కారేపల్లిలో పోలీసు, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రవాణాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందన్నారు. మాదక ద్రవ్యాలను వినియోగించినా, వాటిని రవాణా చేసిన కఠిన శిక్షిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై వసంతలక్ష్మి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం, కేజీబీవీ ఎస్‌వో జీ సౌజన్య, వైద్యాధికారి డాక్టర్ బీ సురేష్, సంత ఆలయం చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తలారి చంద్రప్రకాశ్, బీఆర్ఎస్ నాయకులు అడపా పుల్లారావు, పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది రమేశ్, వెంకన్న, శంకర్, పార్థసారధి, జాన్‌పాషా, మదార్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యంగా ఉండొద్దు

### అధికారుల సమీక్షలో కేఎంసీ కమిషనర్ అభిషేక్

సిబ్బందితో సమీక్షిస్తున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్

ఖమ్మం, జూన్ 27 : నగర పాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు. నగరంలో పారిశుధ్య పనుల నిర్వహణ, పర్యవేక్షణ వంటి అంశాలపై కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్లతో కేఎంసీలోని తన చాంబర్‌లో గురువారం ఆయన సమీక్షించారు. పారిశుధ్య పనుల్లో భాగంగా ప్రతిరోజూ నగరంలో ఏయే కార్యక్రమాలు చేపడుతున్నారో అడిగి తెలుసుకున్నారు. 'నగరంలో ఎన్ని డివిజన్లు ఉన్నాయి? ఎంతమంది శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు? ఎంతమంది జవాన్లు పనిచేస్తున్నారు?' అనే వివరాలపై ఆరా తీశారు. 'రోడ్లు శుభ్రపరచడానికి ఎంతమంది కార్మికులు ఉన్నారు? కాలువలు తీయడం కోసం ఎంతమంది పనిచేస్తున్నారు? ఏయే డివిజన్లలో ఎన్ని ట్రాక్టర్లు ఉన్నాయి? ఎన్ని ఆటోలు ఉన్నాయి?, వాటి నిర్వహణ ఎలా ఉంది?' అనే అంశాల గురించి చర్చించారు. 'రోడ్లు ఊడ్చే యంత్రం ఎక్కడ ఉంది? రోజూ అది ఎక్కడ పనిచేస్తోంది? క్రమం తప్పకుండా ఫాగింగ్ చేస్తున్నారా? లేదా?' అనే విషయాల గురించి అడిగి తెలుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శానిటేషన్ సిబ్బంది ఎవరూ విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని సూచించారు.

## గుడిపుడి కుటుంబానికి మంత్రి తుమ్మల పరామర్శ

సత్తుపల్లి, జూన్ 27: సత్తుపల్లి పట్టణానికి చెందిన దుర్గా మెడికల్స్ అధినేత గుడిపుడి గాంధీ తండ్రి గుడిపుడి దుర్గారావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎన్టీఆర్ జిల్లా కొండూరులోని దుర్గారావు స్వగృహానికి చేరుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట నాయకులు చల్లగుండ్ల నర్సింహారావు, చలసాని సాంబశివరావు ఉన్నారు.

## యానాదులకాలనీని సందర్శించిన తహసీల్దార్

వేంసూరు, జూన్ 27: మండలంలోని ఎర్రగుంటపాడులోని యానాదులకాలనీను గురువారం తహసీల్దార్ ఎంఎ రాజు సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకు మా గ్రామానికి అధికారులేవరూ రాలేదని, తహసీల్దార్ వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చెన్నారావు, అంజమ్మ, రంజాన్‌బీ, లాల్ మహమ్మద్, సుజాత, అర్జున్‌రావు, దుర్గారావు, శ్రీను, వెంకటేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సత్తుపల్లిటౌన్, జూన్ 27: సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర సంఘం త్రిసభ్య కమిటీ సభ్యులకు హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశామని ఆ సంఘం సత్తుపల్లి యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరెడ్డి, భద్రుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలను పరిష్కరించనట్లయితే జూలై నెల నుంచి తమ సంఘం ఆధ్వర్యంలో దశల వారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## పంచాయతీ కార్యదర్శిపై విచారణ

రఘునాథపాలెం, జూన్ 27: మండలంలోని పాపటపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిపై ఎంపీవో శ్రీనివాసరెడ్డి విచారణ జరిగింది. గ్రామ కార్యదర్శి మిట్టపల్లి వెంకటరమణపై వచ్చిన అవినీతి ఆరోపణలపై జిల్లా పంచాయతీ అధికారి విచారణకు ఆదేశించారు. దీనిపై గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చిన ఎంపీవో.. బాధితుల నుంచి వాంగ్మూలాలను సేకరించారు. 'ఏ పనికి ఎవరి వద్ద ఎంతెంత వసూలు చేశారు?' అనే విషయాలను బాధితులు రాతపూర్వకంగా అందజేశారు. గతంలోనూ కార్యదర్శిపై అనేక ఆరోపణలు ఉన్నాయి. గ్రామ నాయకుల చెంతన చేరి చేస్తున్న రాజకీయాలపైనా ఇటీవల గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వీటన్నింటిపై దృష్టిసారించిన ఉన్నతాధికారులు.. విచారణ నివేదికను కోరారు. కాగా, విచారణలో బాధితుల అందిన సమాచార నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఎంపీవో తెలిపారు.

## ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కమాన్‌బజార్, జూన్ 27: హైదరాబాద్ హెచ్‌సీయూలో ఎస్ఎఫ్ఐ నాయకులపై పెట్టిన కేసులను, విధించిన సస్పెన్షన్లను తక్షణమే ఎత్తివేయాలని కోరుతూ ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కొత్త బస్టాండ్ సెంటర్‌లో గురువారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పీ.సుధాకర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న వారిని సస్పెండ్ చేయడం సరికాదని అన్నారు. సంఘం నాయకులు ప్రవీణ్, ప్రేమ్, రాజు, వెంకటేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి సీపీఐ రాష్ట్రస్థాయి సమావేశాలు

ఖమ్మం కమాన్‌బజార్, జూన్ 27: సీపీఐ రాష్ట్ర స్థాయి సమావేశాలు ఖమ్మంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభమవుతాయని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## మండలంలో పర్యటించిన డీఏవో

కొణిజర్ల జూన్ 27: మండలంలో జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) విజయనిర్మల గురువారం విస్తృతంగా పర్యటించి పంటలను పరిశీలించారు. తొలుత సింగరాయపాలెం గ్రామంలో క్రాప్ వెరిఫికేషన్ చేసి, వ్యవసాయ శాఖ ద్వారా ఇచ్చిన సబ్సిడీ జీలుగులు వేసిన పొలాన్ని పరిశీలించారు. జీలుగు, జనుము పచ్చిరొట్ట పంట వేసి కలియదున్నడం వల్ల వేసిన పంటకు చాలా మేలు జరుగుతుందన్నారు. కొణిజర్లలో పత్తి పంటను పరిశీలించి పత్తిలో అంతర కృషి చేస్తున్నారని, పత్తి కలుపు లేకుండా చేసుకొని తర్వాత ఎరువులు వేసుకోవాలని సూచించారు. నో క్రాప్ బుకింగ్ స్పెషల్‌డ్రైవ్ ఎలా చేస్తున్నారని తనికెళ్లలో ఏఈవో శ్రీనివాస్‌రాజును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బాలాజీ, ఏఈవోలు శ్రీనివాసరాజు, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేత

కొణిజర్ల, జూన్ 27: మండలంలోని చిన్నమునగాల ప్రాథమిక పాఠశాలలో చేయూత ట్రస్టు వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్స్, ఎక్కల పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం సత్యావతి మాట్లాడుతూ విద్యార్థులు, గ్రామస్తులకు ఉపయోగపడే అనేక కార్యక్రమాల్లో చేయూత ట్రస్టు ఇతోధికంగా సహాయం చేస్తుందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చేయూత ట్రస్టు చైర్మన్ జయరాజు, సభ్యులు పాపగంటి ఏబు, పాపగంటి రవి, ఉపాధ్యాయులు, సభ్యులు జమలయ్య, చిన్నబాబు, మాజీసర్పంచ్ స్వప్న, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆదివాసీ విద్యార్థులకు దుస్తులు అందజేత

కారేపల్లి, జూన్ 27: మండలంలోని ఎర్రబోడు సమీపం గల ఊటవాగు అటవీలో నివాసముంటున్న ఆదివాసీ గిరిజన కుటుంబాల విద్యార్థులకు చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం దుస్తులను అందజేశారు. గతంలో కారేపల్లి ఎస్సైగా పనిచేసి ప్రస్తుతం ఖమ్మం రూరల్ ఎస్సైగా పనిచేస్తున్న పుష్పాల రామారావు ఊటవాగు ఆదివాసీల పరిస్థితిని చేతన ఫౌండేషన్‌కు వివరించగా వారు స్పందించి గిరిజన విద్యార్థులకు కొంగర రామచంద్రరావు ఆర్థికసాయంతో దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ సభ్యులు దొడ్డ సీతారామయ్య, కొంగర పురుషోత్తం, చంద్రకాని నవీన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ, వ్యవసాయేతర భూముల సర్వే

బోనకల్లు, జూన్ 27 : రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు మండలంలోని బోనకల్లు, ముష్టికుంట్ల, రావినూతల, గోవిందాపురం-ఎల్, చిన్నబీరవల్లి, రాయన్నపేట ఆరు క్లస్టర్లలో వ్యవసాయ విస్తరణ అధికారులు వ్యవసాయ, వ్యవసాయేతర భూముల సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సర్వేను ఏవో ఎస్.సరిత పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని భూముల సర్వేను చేపట్టడం జరుగుతుందన్నారు. ఇచ్చిన సర్వే నెంబర్ల ఆధారంగా రైతులను కలిసి వారి భూముల వద్దకు వెళ్లి సర్వేను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు సాధన, నాగసాయి, కళ్యాణి, తేజ, త్రివేణి, రైతులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి సంజయ్‌కి ఉద్యోగ జేఏసీ నేతల వినతి

ఖమ్మం, జూన్ 27: తెలంగాణలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశ పెట్టాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు జేఏసీ నేతలు మారం జగదీశ్, ఏలూరి శ్రీనివాసరావు గురువారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందచేశారు. టీఎన్‌జీవోస్, టీజీవోస్ బాధ్యులు లక్ష్మణ్, కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, రామారావు, నరహరి, ప్రభాకర్ రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, రఘునందన్‌రావు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజం అందరి బాధ్యత

కూసుమంచి, జూన్ 28 : సమాజంలో డ్రగ్స్ వల్ల ఎంతో మంది యువత, విద్యార్థుల జీవితాలు ఆగం అవుతున్నాయని సీఐ జనార్ధన్, ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. మాదక ద్రవ్యాల నివారణ, అక్రమ రవాణాపై అరికట్టాలని పోలీసులు గురువారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలకు అలవాటు పడి ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని అన్నారు. దీనిని సమూలంగా అరికట్టాలంటే యువత, విద్యార్థులు, ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కూసుమంచి పోలీసులు, యువత పాల్గొన్నారు.

## రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలించిన కేఎంసీ మేయర్

ఖమ్మం, జూన్ 27: ఖమ్మం నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి రూ.70 లక్షలతో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)ని కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ గురువారం పరిశీలించారు. 49, 46 డివిజన్లను కలుపుతూ నిర్మించిన రోడ్డు పనులను, డ్రైనేజీ పనులను కూడా ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా 49వ డివిజన్ కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. మామిళ్లగూడెం నుంచి బైపాస్ రోడ్డు ఆంజనేయస్వామి దేవాలయం వరకు రోడ్డు మంజూరు చేయాలని మేయర్‌ను కోరారు. 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి, మాజీ కార్పొరేటర్ దీపక్‌చౌదరి, మున్సిపల్ అధికారులు, నాయకులు శ్రీనివాస్, నవ్యజ్యోతి, ఉపేందర్‌నాయక్, ఫరీద్, సింగం శ్రీనివాసరావు, బాణాల లక్ష్మణ్, సతీశ్, భాను తదితరులు పాల్గొన్నారు.

## 'కాలువల్లో సిల్ట్ తొలగింపు పనులను పూర్తిచేయాలి'



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కర్నాటి కృష్ణ

ఖమ్మం, జూన్ 27: ఖమ్మం లోని 41వ డివిజన్‌లో మురుగుకాలువ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆ డివిజన్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణ అధికారులను కోరారు. డివిజన్‌లోని ప్రధాన కాలువల్లో సిల్ట్ తొలగించే పనులను గురువారం ఆయన పరిశీలించారు. వర్షాకాలంలో వాగు ఉప్పొంగి మురుగునీరు పరిసర ప్రాంతాల ప్రజల ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉన్నందున పనులు శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. కేఎంసీ అధికారులు జ్యోతి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **ఖమ్మం బ్రాంచ్-2** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **బండి ఉద్దండయ్య,** S/o : **వెంకటేశ్వర్లు, వయస్సు** : 34 సం॥లు, **వృత్తి** : ప్రైవేట్ లెక్చరర్, **నివాసం** : ఇ.నెం. 3-24, తిరుమలాపురం గ్రామం, చింతకాని మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **3** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నాక్లయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి:** ఖమ్మం రిజిస్ట్రేషన్ జిల్లా మరియు సబ్ జిల్లా ఖమ్మం జిల్లా ప్రజాపరిషత్, ఖమ్మం నగర మున్సిపల్ కార్పోరేషన్ ఏరియాలో, ఖమ్మం సర్వే నెం. 406/అ మింజుమలె, శ్రీనివాసనగర్ నందు గల నివేశన ఖాళీ స్థలము, ప్లాటు నెం.9, విస్తీర్ణం. 176-50 చ॥గ॥ = 147-57 చ॥మీ॥లు, **డాక్యుమెంట్ నెం. 13172/2023,** గల స్థిరాస్తినకు హద్దులు : **తూర్పు** : రోడ్డు, **పడమర** : ప్లాటు నెం. 27 & 28, **ఉత్తరం** : ప్లాటు నెం. 10 & 11, **దక్షిణం** : ప్లాటు నెం. 8.

**జి.హరేందర్ రెడ్డి**
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## వ్యక్తిని బెదిరించి బంగారం ఎత్తుకెళ్లిన దుండగులు

బాబును విచారిస్తున్న ఎస్ఐ గిరిదర్‌రెడ్డి

తిరుమలాయపాలెం, జూన్ 27 : మండలంలో ఓ వ్యక్తిని ఇద్దరు వ్యక్తులు కత్తులతో బెదిరించి మెడలోని బంగారపు చైన్, చేతి ఉంగరాన్ని ఎత్తుకెళ్లిన ఘటన గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన రైతు కొండబాల బాబు పొలం వద్ద నుంచి ఇంటికెళ్తుండగా మార్గమధ్యలో బందం కుంట వద్ద ముఖానికి మాస్క్ ధరించి ఉన్న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆకస్మికంగా వెళ్లి కర్రలు, కత్తులతో బాబును బెదిరించి మెడలోని బంగారపు చైన్, ఉంగరం, సెల్‌ఫోన్ దొంగిలించినట్లు తెలిపాడు. కొద్దిదూరంలో సెల్‌ఫోన్‌ను చెట్ల పొదల్లో పడివేసి ములకలపల్లి రోడ్డు వైపు వెళ్లినట్లు తెలిపారు. ఆ రహదారిలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆపి అతని సెల్‌ఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు స్థానిక ఎస్.ఐ.గిరిదర్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. దారి దోపిడీ జరిగిన తీరును బాబును అడిగితెలుసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్

మధిర, జూన్ 27 : పట్టణంలోని సిద్ధారెడ్డి బంజరలో మున్సిపాలిటీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా అవుతునపటికీ ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో పెనుముప్పు తప్పింది. అటుగా వస్తున్న కొంతమంది వాహనదారులు గమనించి భయభ్రాంతులకు గురయ్యారు. ట్రాక్టర్ డ్రైవర్ అప్రమతమై ట్రాక్టర్‌పై నుంచి దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. బాధ్యత రహితంగా వ్యవహరించిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

మామిళ్లగూడెం, జూన్ 27: అతిగా మద్యం తాగి ఆహారం, నీళ్లు తీసుకోకుండా ఉండడంతో ఓ వ్యక్తి మరణించిన ఘటన ఖమ్మంలో చోటుచేసుకుంది. ఖమ్మం త్రీటౌన్ పోలీసులు గురువారం వెల్లడించిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మేళ్లచెరుకు చెందిన కొడారి అప్పారావు(40)కు ఖమ్మం సుందరయ్యనగర్‌కు చెందిన రేణుకతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉపాధి కోసం కొన్నేళ్ల క్రితం ఖమ్మం వచ్చారు. ఇక్కడే అతడు హమాలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో అతడు మద్యానికి బానిసయ్యాడు. ఈ కలహాల నేపథ్యంలో భార్య రేణుక మూడు రోజుల క్రితం తల్లిగారింటికి వెళ్లింది. దీంతో ఇంట్లో ఒక్కడే ఉండి అతిగా మద్యం తాగాడు. తలుపు గడియ పెట్టుకుని నిద్రపోయాడు. రెండు రోజులుగా తలుపు తీయకపోవడంతోపాటు ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని తలుపు తెరిచి చూడగా అప్పారావు మృతిచెంది ఉన్నాడు. అతడి భౌతికకాయాన్ని పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు కొడారి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు సీఐ రమేశ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆలయంలో చోరీ

కూసుమంచి, జూన్ 27 : మండల పరిధిలోని గంగమ్మ తల్లి ఆలయంలో చోరీ జరిగిన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి... గురువారం ఉదయం ఆలయాన్ని తెరవడానికి వచ్చిన వీరవెల్లి నర్సింహారావు గేటుకు ఉన్న చైన్ తొలగించి ఉండడంతో ఆలయ కమిటీకి సమాచారం తెలియజేశాడు. వారు వచ్చి చూడగా అమ్మవారికి అలంకరించిన బంగారం, వెండి ఆభరణాలు చోరీ గురైనట్లు గుర్తించారు. బుధవారం సాయంత్రం వరకు అక్కడ పని వాళ్లు ఉండి రాత్రికి ఇంటికి వెళ్లడంతో గమనించిన దుండగులు గేటుకు ఉన్న చైన్ తొలగించి వెండి కిరీటం, బంగారు నక్లెస్, ముక్కు పుడక, చెవి కమ్మలు, చెంప సారాలను ఎత్తుకెళ్లారు. వాటి విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించారు.